సమాజ చైతన్యంలో కవుల పాత్ర వెలకట్టలేనిది

● 'ముస్తాదు' పుస్తకావిష్కరణ సభలో కవులు, రచయితలు

ముస్తాదు కవితాసంపుటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

రామగిరి, మే 11: సమాజంలో చైతన్యం తేవడంలో కవుల ప్రాత వెలకట్టలేనిదని కవి, రచయిత మునాసువెంకట్, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య అన్నారు. నల్లగొండకు చెందిన కవి, రచయిత శీలం భద్రయ్య రచించిన 'ముస్తాదు' కవితా సంపుటి పుస్తకావిష్కరణ సభను సృజన సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శీలం భద్రయ్య రచనా శైలి, సామాజిక స్పృహను కొనియాడారు. సృజన సాహితీసంస్థ నల్లగొండ అధ్యక్షుడు పెరుమాళ్ల ఆనంద్ అధ్యక్షతన జరిగిన సభలో కవులు డాక్టర్ సాగర్ల సత్తయ్య, మాదగాని శంకరయ్య, బొల్లెద్దు కిశోర్‌కుమార్, తుల శ్రీనివాస్, రచయిత శీలం భద్రయ్య పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడే వరకూ ఉద్యమం : కేవీపీఎస్

సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంటెపాక కృష్ణ

నకిరేకల్, మే 11 : కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడే వరకు పోరాటాలు కొనసాగించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంటెపాక కృష్ణ పిలుపునిచ్చారు. నకిరేకల్ పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకంగా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, రైతులు, కూలీలు, నిమ్న జాతులు, దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు, మహిళలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిలుముల రామస్వామి, వంగూరి వెంకన్న, మర్రి వెంకటయ్య, నాగార్జున, డి. లింగయ్య, సీహెచ్. కృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయాలి : సీపీఐ

సమావేశంలో మాట్లాడుతున్న బొల్లూరి నరసింహ

మునుగోడు, మే11 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్లూరి నరసింహ డిమాండ్ చేశారు. శనివారం రాత్రి మండలంలోని పులిపలుపుల గ్రామంలో నిర్వహించిన సీపీఐ గ్రామశాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, దరఖాస్తు చేసుకున్న వారికి రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి చాపల శ్రీను, నాయకులు రాములు, కాయిత వెంకన్న, బొల్లూరి ఎల్లయ్య, గుండెబోయిన భాస్కర్, సింగం యాదయ్య, పందుల యాదయ్య, వినీల్, మునుగోటి సత్యనారాయణ, జనగాం శంకరయ్య, దోటి రమేశ్ పాల్గొన్నారు. పలివెల గ్రామంలో జరిగిన సీపీఐ గ్రామ శాఖ మహాసభలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురజ రామచంద్రం పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ గోస్కొండ లింగయ్య, మాజీ ఎంపీపీ మాదగోని సాయిలు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

● బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్

సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

మిర్యాలగూడ, మే 11: రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరం లోనైనా విద్యా హక్కు చట్టం అమలు చేసి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కార్పొరేట్ మాఫియా దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులు చదువుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. ప్రైవేట్ పాఠశాలలు అడ్మిషన్ల పేరుతో అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని, దాంతో తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారని పేర్కొన్నారు. ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం నాయకులు జయరాజ్, మురళీ యాదవ్, ఉపేందర్, గంగాధర్ పాల్గొన్నారు.

విశ్వ సుందరి పోటీలను ఉపసంహరించుకోవాలి

● ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ధనలక్ష్మి

హాలియా, మే 11: రాష్ట్రంలో నిర్వహించే విశ్వ సుందరి ఎంపిక పోటీలను ప్రభుత్వం రద్దు చేయాలని ఐద్వా జిల్లా సహాయకార్యదర్శి కారంపూడి ధనలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అందాల పోటీలు ఎందుకు, ఎవరి కోసం జరుగుతున్నాయని ప్రశ్నించారు. ప్రపంచీకరణ తర్వాత కార్పొరేట్ కంపెనీలు తమ ఉత్పత్తులను లాభసాటిగా అమ్ముకోవడానికి అతి పెద్ద మార్కెట్ అయిన భారతదేశం పైపు దృష్టి సారించాయని పేర్కొన్నారు. శ్రమైక జీవన సౌందర్యానికి ప్రాధాన్యత ఇచ్చే మహిళలను తల్లిగా, చెల్లిగా గౌరవించే ఈ దేశంలో అర్ధనగ్నంగా నిలిపి వారి సౌందర్యాన్ని కొలిచే మిస్ వరల్డ్ పోటీలను ఈ దేశపు మహిళలు ఎంత మాత్రం సహించరని తెలిపారు. ఈ పోటీలకు ప్రభుత్వం పెట్టే ఖర్చుతో పేదలకు ఎంతో మేలు చేయవచ్చని పేర్కొన్నారు. ఆమె వెంట కవిత, ధనమ్మ, రాణి, దుర్గ, విజయ, అనూష ఉన్నారు.

పేకాట ఆడుతున్న నలుగురి అరెస్ట్

కట్టంగూర్, మే 11 : మండలంలోని కల్మెర గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ అఫ్జల్ అలీ తెలిపారు. గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడిచేసి నలుగురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.2520, నాలుగు సెల్ ఫోన్లు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

LONG TERM COACHING
★ BiPC-NEET & MPC-IIT Long Term Coaching Start on June, 1st, SRI CHAITANYA JR. COLLEGE, Hyd. Contact. K. ASHOK REDDY, A.O., Cell:9441884705
NT-MBNR

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ: 9182777625, 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638

భూ సర్వేకు మోక్షమెన్నడో..?

● ఏండ్లుగా పరిష్కారానికి నోచని దరఖాస్తులు ● కార్యాలయం చుట్టూ రైతుల ప్రదక్షిణలు

నిడమనూరు తాసీల్దార్ కార్యాలయం

నిడమనూరు, మే11 : మండలంలో భూముల సర్వే కోసం రైతులు చేసుకున్న దరఖాస్తులకు మోక్షం లభించడం లేదు. భూ వివాదాలు, పట్టా దారు పాసుపుస్తకంలో భూముల అదృశ్యం, సర్వే నంబర్‌కు హద్దుల ఏర్పాటు వంటి అంశాలపై రైతులు భూ సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నారు. 2024 నుంచి ఏప్రిల్ 2025 వరకు మండలంలో 104 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో 66 దరఖాస్తులు పరిష్కరించినట్లు అధికారులు చెబుతున్నారు. మిగతా వాటిని తిరస్కరించామని, మరో 19 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నా.. వాస్తవ లెక్కలు వేరేగా ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు. మండల సర్వేయర్ విజయ్ కుమార్ గతంలో తిరుమలగిరిసాగర్ మండలంలో పైలట్ ప్రాజెక్టు, యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టుల విధుల కోసం డిప్యూటేషన్‌పై వెళ్లగా ప్రస్తుతం ఆయన మిర్యాలగూడ ఇన్‌చార్జి డివిజన్ ఇన్‌స్పెక్టర్, అనుముల సర్వేయర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దాంతో మండలంలో సర్వేయర్ అందుబాటులో లేకపోవడంతో సర్వే కోసం రైతులు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సర్వే కోసం దరఖాస్తు చేసుకొని అధికారి చుట్టూ తిరుగుతున్నా సర్వే చేయకుండా వాయిదా వేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. దరఖాస్తు చేసిన రైతు భూముల సర్వే కోసం నోటీసులు ఇవ్వాల్సి ఉన్నా.. ఇవ్వకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా భూ సర్వేను పూర్తి చేసేందుకు జిల్లా ఉన్నతాధికారులు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై మండల సర్వేయర్ విజయ్ కుమార్‌ను వివరణ కోరగా ప్రస్తుతం 19 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. తాను ఇటీవలి కాలం వరకు తిరుమలగిరి సాగర్ పైలెట్ ప్రాజెక్టు, అనుముల సర్వేయర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నందున ఆలస్యమవుతున్నట్లు వివరించారు. అత్యవసరమైన వారికి సర్వే చేపట్టి నివేదికను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్‌జీ కళాశాలలో అడ్మిషన్ల కోసం దోస్త్‌లో దరఖాస్తు చేసుకోవాలి

● ప్రిన్సిపాల్ ఉపేందర్

రామగిరి, మే 11: జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరంలో వివిధ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల కోసం విద్యార్థులు దోస్త్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కళాశాలలో వివిధ కోర్సుల్లో 1,560 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు కళాశాల దోస్త్ టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్ సెల్: 9985824737, నాగరాజు సెల్ : 9394738401 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నకిరేకల్, మే 11 : నకిరేకల్ పట్టణ కేంద్రంలో 11కేవీ విద్యుత్ లైన్‌కు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సాయి గణేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

దామరచర్లలో

దామరచర్ల : మండలంలోని దామరచర్ల, తిమ్మాపురం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు ఈ నెల 12న ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అబ్దుల్ హబీబ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మాపురం సబ్‌స్టేషన్, వాడపల్లి ఫీడర్ లైన్ల పరిధిలో విద్యుత్ లైన్లకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున తిమ్మాపురం, పడమటితండా, కల్లేపల్లి, వాడపల్లి, గణేశ్‌పాడు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

హాలియాలో..

హాలియా : హాలియా, హజారిగూడెం, పులిమామిడి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో సోమవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ధనరాజ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుముల, ఈశ్వర్‌నగర్, పెద్దగూడెం స్టేజీ, పులిమామిడి, మార్లగడ్డగూడెం, బంటువారిగూడెం, హజారిగూడెం, అలీనగర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని దృష్ట్యా వినియోగదారులు సహకరించాలని కోరారు.

అర్హులందరికీ రాజీవ్ యువ వికాసం అందించాలి : డీవైఎఫ్ఐ

నకిరేకల్, మే 11 : రాజీవ్ యువ వికాసం స్కీం కోసం లబ్దిదారుల ఎంపికలో సిబిల్ స్కోర్‌ను అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దపాటి సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం నకిరేకల్ పట్టణంలోని నర్రా రాఘవరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రకటించగా 16 లక్షల మంది యువత దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఉపాధి లేక యువత లోన్లు తీసుకోకపోవడంతో సిబిల్ స్కోర్ పెద్దగా ఉండదన్నారు. సమావేశంలో నాయకులు వీరేశ్, స్టాలిన్, గంట మల్లేశ్, రవీందర్, నాగార్జున, సుధీర్, రమేశ్, సురేశ్ పాల్గొన్నారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

కట్టంగూర్, మే 11 : మండలంలోని నారెగూడెం గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ గంట్ల కరుణాకర్‌రెడ్డి(61) శనివారం రాత్రి ప్రమాద వశాత్తు నీటి గుంతలో పడి మృతి చెందాడు. ఏఎస్ఐ అఫ్జల్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. కరుణాకర్‌రెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో నీటి నిల్వ కోసం పాంపాండ్ ఏర్పాటు చేశాడు. శనివారం సాయంత్రం ఈత కొట్టేందుకు నీటి గుంతలోకి దిగగా ప్రమాద వశాత్తు అందులో మునిగి మృతి చెందాడు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు అందించిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టు మార్టం కోసం నకిరేకల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుమార్తె తేజస్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

రేపటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

● ప్రతి ఒక్కరూ విధిగా హాజరుకావాలి : డీఈవో భిక్షపతి

రామగిరి, మే 11: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఈ నెల 13 నుంచి 31 వరకు జిల్లా స్థాయి శిక్షణ తరగతులను విడుతల వారీగా నిర్వహించనున్నట్లు డీఈఓ బి.భిక్షపతి, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారి ఆర్.రామచంద్రయ్య ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లా లోని ప్రభుత్వ పాఠశాలల జీహెచ్ఎం, ప్రిన్సిపాల్స్, కేజీబీవీ ఎస్ఓ, స్కూల్ అసిస్టెంట్స్, ఎల్‌పీటీ, హెచ్‌పీటీ, పీఈటీ, టీజీటీ, సీఆర్‌టీ ఉపాధ్యాయులు ఎంపిక చేసిన తేదీల్లో విధిగా హాజరు కావాలని సూచించారు. మొత్తం 3,173 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణపై ఈ నెల 12న కలెక్టర్ ఇలా త్రిపాఠి సంసిద్ధత సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందే వారు తమకు కేటాయించిన తేదీల్లో ఉదయం 9:30లోపు ఆయా సెంటర్లలో రిపోర్టు చేయాలని సూచించారు. పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలకు సిద్ధం చేయాలని, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ కోసం బాడిబాట నిర్వహించాలని, ఆయా మండలాల ఎంఈఓలు పర్యవేక్షణ చేసి నివేదికలు అందించాలని ఆదేశించారు.

మూడు విడుతలుగా శిక్షణ

తొలివిడుత శిక్షణ తరగతులు ఈ నెల 13 నుంచి 17 వరకు, రెండో విడుత ఈ నెల 20 నుంచి 24 వరకు, మూడో విడుత ఈ నెల 27 నుంచి 31 వరకు నిర్వహిస్తారు. ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులకు మండల స్థాయిలో ఈ నెల 20 నుంచి 24 వరకు ఐదు అంశాల్లో శిక్షణ ఉంటుందని డీఈఓ తెలిపారు.

బ్రాహ్మణచారి సేవలు చిరస్మరణీయం

● విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ ప్రతినిధులు

రామగిరి, మే 11: విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ వ్యవస్థాపకుడు, కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ దివంగత పెండోట బ్రాహ్మణాచారి సమాజాభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమని విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ జిల్లా గౌరవాధ్యక్షుడు కొండోజు కృష్ణమాచారి అన్నారు. పెండోట బ్రాహ్మణాచారి సంతాప సభ ఆదివారం నల్లగొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మంగారి గుట్ట అభివృద్ధితో పాటు కాశీవిశ్వేశ్వర దేవస్థాన చైర్మన్‌గా ఆరు సంవత్సరాలు పనిచేసిన ఆయన సొంత నిధులతో ఆలయాన్ని అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. దాంతో పాటు విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ ఏర్పాటు చేయడంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేశారని గుర్తు చేసుకున్నారు. అంతకు ముందు బ్రాహ్మణాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సేవా సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండోట సోము అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దాసోజు శ్రీనివాస్, కోశాధికారి పర్వతం నరేంద్రబాబు, నిర్వాహకులు శ్రీపాద కృష్ణమాచారి, పగిడిమర్రి వెంకటాచారి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నకిరేకల్ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

శాలిగౌరారం : వల్లాలలో సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

నకిరేకల్, మే 11 : నేతాజీ విద్యా నికేతన్ ఉన్నత పాఠశాలలో1993–1994 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం నకిరేకల్‌లోని ఫంక్షన్‌హాల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను శాలువా, మెమెంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వంగాల ప్రతాప్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నంద్యాల సురేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, వంగాల ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వర రావు, పోతుల గోపాల్, సారంగి వెంకన్న, నిర్వాహకులు తడచిన మధుసూదన్‌రెడ్డి, గుణగంటి శ్రీనివాస్, మారం అరుణ, గోపాల్ పాల్గొన్నారు.

వల్లాల జడ్పీహెచ్ఎస్‌లో..

శాలిగౌరారం : మండలంలోని వల్లాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006–07 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాంతో పాటు మండల కేంద్రంలోని విజ్ఞానజ్యోతి హైస్కూల్‌లో 2004–05 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి హెచ్ఎం బుడిగె శ్రీనివాస్, ఉపాధ్యాయులు శివశంకర్, పడాల అంతయ్య, సుబ్రహ్మణ్యశర్మ, మద్ది శశిధర్‌రెడ్డి, రావుల వీరయ్య, సత్యనారాయణ, పులిజాల శ్రీనివాస్‌రావు, వేముల సోమయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి : సీఐటీయూ

సమ్మె కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మిర్యాలగూడ టౌన్, మే 11: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని, వీటి వల్ల కార్మిక సంక్షేమం నిర్వీర్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, జగదీశ్చంద్ర, శశిధర్‌రెడ్డి, పరశురాములు, పాదూరి గోవర్ధని, శ్రీనివాసాచారి, రమేశ్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

చిట్యాల : ఈ నెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఆదివారం చిట్యాలలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేశ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు అజీజ్, కార్యదర్శి కొండ్రెడ్డి నరసింహ, యూనియన్ నాయకులు అవిశెట్టి కృష్ణ, గునగంటి కృష్ణయ్య, పుల్లెంల యాదయ్య, జడల ఊశయ్య, శివ, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారులకు పోషకాహారం పంపిణీ

నల్లగొండ రూరల్, మే 11 : నల్లగొండ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న క్రీడాకారులకు ఆదివారం ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి మోహన్ పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో క్రీడాకారులు ప్రభాకర్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఆదిరెడ్డి, బండారు రమేశ్, మహేందర్‌రెడ్డి, నరేందర్, క్రాంతి, నాగరాజు, లక్ష్మణ్, శ్రీను పాల్గొన్నారు.

దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తండ్రి కనిలాల్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

ఘనంగా మాతృదినోత్సవం

నకిరేకల్ :తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

దేవరకొండరూరల్, మే11 : మాతృదినోత్సవాన్ని ఆదివారం స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మహాలక్ష్మి వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు కేక్ కట్ చేసి ఆశ్రమంలోని వృద్ధులను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ సభ్యులు క్రీడాకారులు, కళాకారులు పాల్గొన్నారు.

తల్లి దండ్రులకు పాదపూజ

వృద్ధాశ్రమంలో కేక్ కట్‌చేస్తున్న స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు

నకిరేకల్ : మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని నకిరేకల్ పట్టణంలోని గుడిపాటి ఫంక్షన్ హాల్లో ఆదివారం వాసవీ క్లబ్, వాసవీ కపుల్స్ క్లబ్, వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ క్లబ్‌ల ప్రతినిధులు ఉప్పల వెంకటరమణ, దేవరశెట్టి సత్యనారాయణ, గుండా నరేందర్, గుడిపాటి రవి, తేలుకుంట్ల రాజు, కందగట్ల శ్వేత, బాలాజీ, సంతోశ్ పాల్గొన్నారు.

ఎప్‌సెట్‌లో జాస్రిత అకాడమీ విద్యార్థుల ప్రతిభ


అర్షియా తబుస్సుమ్


మారియా

రామగిరి, మే 11: నల్లగొండలోని జాస్రిత అకాడమీ విద్యార్థులు టీఎస్ ఎప్‌సెట్–2025లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఉమ్మడి జిల్లాలో ఉత్తమ ప్రతిభ చూపినట్లు నిర్వాహకులు తెలిపారు. అకాడమీకి చెందిన మారియా 526, అర్షియా తబుస్సుమ్ 822, ఆఫీయా సదాఫ్ 1133, ఫహద్ 1284, ఫారియా మెహవిశ్ 1603, మరియా 2025, దీక్షిత 2301, షర్వాణి 2538, ఇందు 2851, హిబా అన్వార్ 3068, వర్షిత 3106, జూహ అంజం 3315, ఆఫియా జబీన్ 3900, మారియా తరన్నుం 4001, హుర్నాజ్ 4312, అక్షర 4500 ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. ఎప్పటికప్పుడు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ ప్రత్యేక కాలనిర్ణయ పట్టికతో ప్రణాళిక ప్రకారం పరీక్షల నిర్వహణతోనే విద్యార్థులు విజయం సాధించారని తెలిపారు. తమ సంస్థ విద్యార్థులు నీట్‌లో సైతం ఉత్తమ ర్యాంకులు సాధిస్తారన్నారు. ఎంతో మంది విద్యార్థులను అతి తక్కువ ఫీజులతో కార్పొరేట్‌కు దీటుగా శిక్షణ అందించి డాక్టర్లుగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు.

ఎప్‌సెట్‌లో ప్రగతి విద్యార్థుల హవా



రామగిరి, మే 11: ఎప్‌సెట్ –2025 ఫలితాల్లో నల్లగొండలోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కళాశాలకు చెందిన కె.ఉజ్వల 314, ఎం.షైని 1,308, అరిబా తబుస్సుమ్ 1,363, సింధు 1,847, నబీహా మాహిన్ 2,812, బి.భవాని 3,755, అమతుల్ ముజీబ్ షెజాన్ 4,294, చరణ్ 4,768 ర్యాంకులు సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. 72 మందికి 15 వేల లోపు ర్యాంకులు, 153మంది విద్యార్థులు 25 వేలలోపు ర్యాంకులు సాధించినట్లు వెల్లడించింది. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ చందాకృష్ణమూర్తి, డైరెక్టర్లు ఎ.నరేందర్‌బాబు, ఎన్.శశిధర్‌రావు, చందా శ్రీనివాస్, పైళ్ల రమేశ్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

'ఎప్‌సెట్'లో గౌతమి ప్రభంజనం


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు వెంకట్‌రెడ్డి, రమణారెడ్డి

రామగిరి, మే 11: టీఎస్ ఎప్‌సెట్–2025 ఫలితాల్లో నల్లగొండలోని గౌతమి విద్యా సంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాం కులు సాధించి ఉమ్మడి జిల్లాకే వన్నెతెచ్చినట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు. కళాశాలకు చెందిన ఎండీ. ఉజైర్ 165, యాస్మిన్ 435, భవ్యశ్రీ 737, ఆఫీయా సదాఫ్ 1133, వి.గాయిత్రి 1361, బుష్రా 1588, సుహాన 2090, షైలా అలీఖాన్ 2267, సాయి నిఖిల 3228, శ్రుతి 3522, హేమచందర్ 4561ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. 20 మంది విద్యార్థులు 10వేలలోపు, 61 మంది 20వేలలోపు ర్యాంకు సాధించినట్లు తెలిపారు. వీరిని కళాశాల డైరెక్టర్లు కాసర్ల వెంకట్‌రెడ్డి, చల్లా వెంకటరమణ, కొమ్మిడి రఘుపాల్ రెడ్డి, పుట్ట వెంకటరమణారెడ్డి అభినందించారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి విద్యార్థుల ఆర్థిక సాయం

ఆర్థికసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

హాలియా, మే 11: అనుముల మండలం మదారిగూడెం గ్రామానికి చెందిన ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు కుందారపు యాదగిరి వారం రోజుల క్రితం వడదెబ్బతో మృతి చెందాడు. ఆయన వద్ద చదువుకున్న వివిధ పాఠశాలల పూర్వ విద్యార్థులు ఆదివారం గ్రామానికి వెళ్లి యాదగిరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 20 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆవుల శ్రీనివాస్, చెరుకు సైదులు, బైరు శ్రీను, రావుల రామాంజీ, చంద నాగేంద్ర, ఆవుల నాగలక్ష్మి పాల్గొన్నారు.

లిటిల్ సోల్జర్స్ ఆధ్వర్యంలో..

నకిరేకల్ : నల్లగొండ జిల్లా కేంద్రంలోని పెద్దబండ ప్రాంతానికి చెందిన నీలకంఠం యాదగిరి కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం డబ్బులు లేక అతడి కుటుంబ సభ్యులు లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులను ఆశ్రయించారు. స్పందించిన ఫౌండేషన్ ప్రతినిధులు ఆదివారం నకిరేకల్ పట్టణంలోని మినీ స్టేడియంలో యాదగిరి కుటుంబ సభ్యులకు రూ.20,200 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేశ్, కర్నాటి నరేశ్, నాగాచారి, వంశీ, విక్రమ్, అనిల్, నైన్ నెట్ నరేందర్, సంతోశ్, కృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

మెడికల్ విద్యార్థికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న అమిత్‌రెడ్డి

చిట్యాల, మే 11 : మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన కత్తుల అలివేలు ఎంబీబీఎస్ 4వ సంవత్సరం చదువుతున్నది. ఆమె ఆర్థిక పరిస్థితి సరిగా లేక ఇబ్బందులు పడుతుండడంతో గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా రూ.50వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం రాష్ట్ర డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అందించారు. విద్యార్థినికి మూడు సంవత్సరాల నుంచి ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.